# "రాకుమారీ స్వయంవరం"

వనశ్రీ

"మిస్టర్ విశ్వనాథం బి. ఎ.," తలుపు నెట్టుకొని లోపలకు వచ్చి పోస్టు మాన్ ఉత్తరం ఇచ్చాడు.

పొడుగాటి గోధుమవన్నె కవరుచూడగానే విశ్వనాథానికి పంచప్రాణాలు లేచి వచ్చాయి.

ఆత్రంగా కవరుపైన డిస్పాచెస్ చూశాడు.

అదే! సంవత్సరం మూడుమాసాలుగా కళ్ళల్లో వత్తులు పెట్టుకొని దేనికోసం ఎదురు చూశాడో అదే!

విశ్వనాథం నక్షత్రాలు కనికరించాయి! ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్ నుంచి ఉత్తరం వచ్చింది!

కవరు విప్పుతూంటే విశ్వనాథం చేతులు వణికాయి. ఆశలు తేనెటీగల్లా ఝుంయ్యిమని ముసురుకొన్నాయి.

'రేపు పదకొండు గంటలకు ఎక్ఛేంజ్ ఆఫీసులో హాజరుకావాల'ని వున్నది.

కవరుమడిచి భద్రంగా జేబులో పెట్టుకొని పక్కకు చూశాడు.

అమ్మా, చెల్లెలూ, తమ్ముడూ చుట్టూ చేరి నోరుతెరచుకొని విశ్వనాథం ముఖం లోకి చూస్తో నుంచున్నారు.

"ఎక్కడన్నా వుద్యోగం అయిందా?" అన్నది తల్లి అతుకులేసిన పాతచీరతో ముఖానపట్టిన చెమట తుడుచుకొంటూ.

"ఆఁ. రేపు ఇంటర్వ్యూకి వెళ్ళాలి! తర్వాత తెలుస్తుంది!" అన్నాడు.

ఆరాత్రి ఇంట్లో ఎవరికీ సరిగా నిద్రపట్ట లేదు. విశ్వనాథం తల్లి, కొడుక్కు ఉద్యోగమయితే తిరుపతి శేషుడికి మొక్కు చెల్లించుకొంటానని రాగిడబ్బు మూట కట్టింది.

విశ్వనాథం ఆరాత్రి తన స్వప్నాలన్నీ నిజాలయినట్టు కలకన్నాడు! తనకు దొరకగల వుద్యోగాన్ని గురించిన ఆలోచనలతో మెదడు వుడికిపోయింది.

నిద్రలేచేసరికి ఏడుగంటలు దాటింది. స్నానంచేసి వున్న గుడ్డల్లో మంచివి ఏరి వొక చొక్కా ప్యాంటూ పెట్టెలోంచి బయటికి తీశాడు. మరి ఇన్టర్వ్యూకు పోతున్నాడాయె!

తీరా చొక్కా మడతలు విప్పివేసుకో పోయేసరికి గూడుమీద దమ్మిడీ వెడల్పున కొరుపట్టివుంది! చాకలాడ్ని నాలుగు తిట్టుకొని తమ్ముడ్ని పిలిచి చొక్కా మిషన్ వాడి దగ్గరికి పంపించాడు.

మంచి శకునం చూసి తల్లి విశ్వనాథాన్ని —వుద్యోగాన్వేషణలో - స్వయంవరానికి పోతూన్న విశ్వనాథాన్ని సాగనంపింది.

విశ్వనాథం యంప్లాయిమెంట్ ఆఫీసు చేరుకొనే సరికి నలుగురు కేండిడేట్సు అప్పటికే వచ్చి కాచుకొని వున్నారు.

ఆ నలుగురూ, వస్తోన్న విశ్వనాథాన్ని అదోలా చూశారు. వాళ్ళ చూపులు విశ్వనాథం భరించలేకపోయాడు. తల వంచుకొని ఖాళీగా వున్న బల్లమీద కూర్చున్నాడు.

కొంచంసేపటికి ఒక గుమస్తా వచ్చి ఫైల్లోనుంచి ఒక పేపరు తీసి గడగడా ఐదు పేర్లు చదివాడు. ఐదుగురూ వరుసగా లేచి నుంచున్నారు.

గుమాస్తా వాళ్లందరనూ వోసారి ఎగాదిగా చూసి—

"అడవీ-పరిశ్రమల శాఖాఫీసులో వొక యల్. డి. సీ. పోస్టు ఖాళీ వచ్చింది! మధ్యాహ్నం ఒంటిగంటన్నరకు ఫారెస్టు ఆఫీసరుగారు ఇన్టర్వ్యూ చేస్తారు! మీలో సెలక్టు అయిన వొకర్ని తీసుకొంటారు. వెళ్లండి! ఇదిగో యీ పేపరు తీసుకొని ఆఫీసులో యిస్తే మిమ్మల్ని యిన్టర్వ్యూ చేస్తారు!" అని చెప్పి ఫైల్లోంచి తీసి వొక పేపరు ఇచ్చాడు.

విశ్వనాథం ఆ పేపరు అందుకొందామని అనుకొంటుండగానే ఇంకొకడు ముందుకు వచ్చి అందుకొన్నాడు.

విశ్వనాథం వాడ్ని పరీక్షగా చూశాడు. జుట్టుముడీ, చాలీచాలని చొక్కా, అడ్డకట్టూ కాళ్ళకు చెప్పులుకూడా లేవు. వాడికి ఎంతచొరవా? వాడ్నిచూస్తే విశ్వనాథానికి ఏవగింపుగా వుంది! జుట్టుముడి కొండిశెట్ పేపరు మడిచి జేబులో పెట్టుకొని అందరికంటే ముందు నడిచాడు. మిగతా నలుగురూ అతనివెనకే నడవటం మొదలు పెట్టారు.

త్రోవలో జుట్టుముడివ్యక్తి వాలకం చూస్తూన్న కొద్దీ విశ్వనాథానికి వళ్లుమండుకు వస్తోంది. వీడికి ఎంతచొరవా! వీడే ఛాన్సు కొట్టేస్తాడేమో?

"మిస్టర్ తిరుమలై! వాటీజ్ యువర్ క్వాలిఫికేషన్?" అడుగులో అడుగు కలిపి విశ్వనాథం జుట్టుముడి అభ్యర్థిని అడిగాడు.

"పాస్డ్ మెట్రిక్యులేట్!" ధీమాగా జవాబు చెప్పాడు మిస్టర్ తిరుమలై.

"నేను బి. ఎ.!" ఎవరూ అడగందే చెప్పాడు విశ్వనాథం. కడుపులోని మంటా కసీ కొంత తీరినట్టయింది. ఈదెబ్బకు వాడి పిలకముడి పునాదులు కదిలిపోయివుంటయ్ లే అనుకున్నాడు విశ్వనాథం. వాడిక తగ్గిపోతాడు!

"వై? ఐ యాం ఎ బి. యస్. సి., విత్ ఫిజిక్స్ మెయిన్!" అన్నాడు మిస్టర్ ఆనందరావు 'టూటాల్ టై' సదులు చేసుకొంటూ.

విశ్వనాథం దిమ్మరపోయి ఆనందరావుకేసి చూశాడు.

లినెన్ సూటు ఎండలో తళతళలాడుతోంది. కొత్త షైక్స్‌బూటు నాడాలు సిమెంట్ రోడ్డు మీద లయయుక్తంగా మోగిస్తో ఆనందరావు ఠీవిగా నడుస్తున్నాడు.

విశ్వనాథం, తన డోక్కుపోయిన జీన్ని కోరా ప్యాంటూ, యం. యస్. రక చొక్కా, సూటుమీద మిసిమీ పాయిబు పనితనమూ, అరిగిపోయిన బాటా చెప్పులూ చూసుకొని కుంగిపోయాడు. పెరగబోయిన



డిస్ట్రిబ్యూటర్లు:
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజెన్సీస్),
విజయవాడ-1.



ఒడ్డుపట్టిన పడవలు —ఫోటో: పి. సి. ఎమ్. ఈశ్వరబాబు.

## ★ "రాకుమారీ స్వయంవరం" ★

వ్యక్తిత్వం అణిగిపోయింది! ఛీ! తన ముఖాన్ని చూసి, తన గుడ్డలు చూసి ఆఫీసరు వుద్యోగం ఇస్తాడా?

"ఎల్. డి. సీ. పోస్టుకు మెట్రిక్యులేషన్ చాలు!" అన్నాడు తిరుమలై.

అంతా తిరుమలైవంక చూశారు.

"ఇంతకీ అక్కడ ఇన్‌టర్వ్యూలో సెలెక్ట్ కావాలి!" చిక్కు సమస్య ముడి విప్పినట్టుగా అన్నాడు తిరుమలై.

విశ్వనాథం హృదయంలో మళ్లీ ఆశలు చిగురించినై.

"నీకేం తెలివితేటలు గలవాడివి! ఇన్‌టర్‌లో క్లాసు వచ్చింది! కాలేజీ ఉపన్యాసపు పోటీలో సెకండ్! నీకేం!" అని విశ్వనాథానికి తన లోపలనుంచి వినపడుతున్నాయి.

"అవునవును!" అనుకొన్నాడు విశ్వనాథం.

అందరూ ఫారెస్టు ఆఫీసు చేరుకొనేసరికి మధ్యాహ్నం ఒంటిగంట ఐంది.

ఆఫీసరుగారి ప్యూను వచ్చి అందర్నీ పరకాయించి చూసి—"అయ్యగారు పనిలో వున్నారు! ఇప్పుడు చూట్టానికి వీల్లేదు!" అన్నాడు. వాడికి అదో అలవాటు. ఎవ

# ఆంధ్రపత్రిక

## సచిత్ర వారపత్రిక

# పిల్లల దసరా సంచిక

## చిత్రాలు, రచనలకు బహుమతులు

### గడువు తేదీ 1955 సెప్టెంబరు 20

రాబోయే విజయదశమి పండుగకు (26-10-55) ఆంధ్రవారపత్రిక పిల్లల దసరా సంచికగా ప్రచురించబడుతుంది. మామూలు ప్రకారం ఈ సంచికలో బాలబాలికల రచనలకు చిత్రాలకు ప్రాధాన్య మివ్వబడుతుంది. 15 సంవత్సరాలలోపు పిల్లల రచనలు, చిత్రాలలో ఉత్తమమైనవానికి బహుమతు లివ్వబడతాయి.

బాలబాలికల రచనలు చిత్రాలుకాక ఈ సంచికలో ప్రత్యేకచిత్రాలు, ఫోటోలు, వ్యాసాలు, కథలు కూడా ప్రచురించబడతాయి. ఆకర్షణీయమైన ప్రత్యేక త్రివర్ణ ముఖచిత్రంతో సంచికను సర్వాంగసుందరంగా ప్రచురించడానికి కృషి చేస్తున్నాము.

బాల బాలికలకోసం ఉద్దేశించబడిన ఈసంచిక ప్రచురణలో బాల బాలికలు పెద్దలుకూడా మాకు తోడ్పడగలరని ఆశిస్తున్నాము.

చిత్రాలు, రచనలు పంపేవారు ఈక్రింది అంశాలను గమనించ కోరుతున్నాము.

* చిత్రాలు, రచనలు, ఫోటోలు మా కార్యాలయానికి సెప్టెంబరు 20వ తేదీలోగా చేరాలి.
* వీనిని ఎడిటర్, ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రిక, మద్రాసు 1. ఎడ్రస్‌కి పంపాలి. కవరుపైనా లేక రేపర్‌పైనా, లోపల మొదటి కాగితంపైనా, లేక చిత్రంవెనుకా "ఆంధ్ర-వారపత్రిక దసరా సంచికకు" అని వ్రాయాలి.
* ప్రచురణకు స్వీకరించబడని రచనలు, చిత్రాలు, ఫోటోలను తిరిగి తమకు పంపగోరేవారు వానితోపాటే అవసరమైన స్టాంపు చేర్చి పంపాలి.
* రచనలు అచ్చులో మూడు పేజీలకు మించకూడదు. కాగితంపైన ఒకే ప్రక్క సిరాలోనే వ్రాయాలి. చిత్రాలను డ్రాయింగ్ పేపరుపైన ఇండియన్ ఇంక్‌లోనే వ్రాసిపంపాలి బొమ్మలు రంగులలో కాని, రంగు కాగితంపైన కాని పెన్సిల్, సిరాలతో వ్రాసినవి కాని స్వీకరించబడవు.
* 15 సంవత్సరాల లోపు బాలబాలికలు మాత్రమే పోటీలో పాల్గొనవచ్చును.
* రచనలు, చిత్రాలు స్వతంత్రమైనవై ఉండాలి.
* పోటీలో పాల్గొనడానికి రుసుము లేదు.
* రచయితలు, చిత్రకారులు తమ పూర్తి పేరు (ఇంటిపేరుతో సహా), వయస్సు, చిరునామా అన్నీ వివరంగా రచనలూ చిత్రాలతోపాటే వ్రాసిపంపాలి.
* రచనలు చిత్రాలనుగురించి ఉత్తరప్రత్యుత్తరాలు జరపవద్దని రచయితలను చిత్రకారులను కోరుతున్నాము.

—సంపాదకుడు.

రొచ్చినా ముందు చూట్టానికి యిప్పుడు వీల్లేదంటాడు. మరి వాడు పెద్ద అయ్యగారి జవాను. ముందు వాడితో పరిచయం చేసుకోంకే యీగ కూడా లోపలకు వెళ్ళడానికి వీల్లేదు. అయ్యగారు అర్జంటు పనిలో వుండి లేంది వాడి ఇష్టాయిష్టాలతో వుంటుంది.

"అదికాదు! మమ్మల్ని ఒకటిన్నరకు ఇన్‌టర్వ్యూకు రమ్మన్నారు! యీ కాగితం తీసుకెళ్ళవ్వు!" అంటూ మిస్టర్ తిరుమలై పేపరు తీసి ఇచ్చాడు.

మళ్ళీ విశ్వనాథానికి కాలికింద ఒక మెట్టు జారినట్టయింది! జవానుతో తను మాట్లాడదామని అనుకుంటుండగానే జుట్టు ముడివాడు మాట్లాడేశాడు. అన్నిటికీ వీడే ముందు!

"ఓహో! అట్లాగా? ఐతే అక్కడ కూర్చోండి!" అని దూరంగావున్న బెంచీ చూపించి జవాను ఆఫీసరుగారి గదిలోకి వెళ్ళి క్షణంలో తిరిగొచ్చి ఆఫీసు లోపలి కెళ్ళి ఎస్టాబ్లిష్‌మెంటు సెక్షన్‌లో ఆ పేపరు ఇచ్చి బయటికి వచ్చాడు.

స్వయంవరానికి వచ్చిన రాజకుమారుల్లా ఐదుగురు అభ్యర్థులూ బల్లమీద మౌనంగా కూర్చున్నారు. తమ భవిష్యత్తు గురించిన ఆలోచనలు కళ్ళెం తెగిన గుర్రాల్లా వాళ్ళ బుర్రల్లో స్వారీ చేస్తున్నాయి.

ముహూర్తం దగ్గరపడుతోంది! రాజకుమారి - ఉద్యోగలక్ష్మి - ఎవరిని వరిస్తుందో? విశ్వనాథం గుండెల్లో ఏదో దడ

# ★ 'రాకుమారీ స్వయంవరం' ★

దడగా వుంది! అబ్బే ఏమిటి? తను భయపడుతున్నాడా? అలా భయపడిపోతే లోపల ఆఫీసరు అడిగిన ప్రశ్నలకు తనేం బదులుచెప్పగలడు? ఎందుకూ భయం? ఆఫీసరు అడిగినదానికి గడగడా బదులు చెప్పగలడు! తెలివిగా ధైర్యంగా, ఉత్సాహంగా కనపడాలి. మనసంతా ప్రశాంతంగా వుంచుకోవాలి! లేకపోతే గొడవ. కన్ఫ్యూజ్ అయిపోతుంది! అబ్బ మళ్ళీ ఏమిటి యీ వెధవ ఆలోచనలూ? తనెందుకు సెలక్టు కాడూ?

—విశ్వనాథానికి ముఖమంతా చెమటలు పోసింది. ముఖంమీద చెయ్యి పెట్టుకొని చూసుకొన్నాడు. అబ్బా ఒకటే జిడ్డూ! గుండెల్లో దడా మెదడులో గుర్రాల డెక్కల చప్పుళ్ళూ.

విశ్వనాథం కర్చీఫ్ తీసి ముఖం తుడుచుకొన్నాడు. గొంతు ఎండిపోతూంది. నాలుకతో పెదవులు తడుపుకొన్నాడు. జవాన్ని మంచినీళ్ళడిగితే? ఎంత పిలిచినా వాడు ఇటు రాండే? కిందకు పోయి ఏదన్నా హోటల్లో తాగొస్తే? అంతలోకే ఆఫీసరు గారు పిలిస్తే?

విశ్వనాథం మళ్ళీ ఇంకోసారి ముఖం తుడుచుకొన్నాడు. గోడగడియారం చూశాడు.

ఒంటిగంటా ముప్ఫైనిముషాలు!

ఆఫీసరుగదిలోంచి జవాను బయటికి వచ్చాడు. పిలవడానికే వస్తున్నాడా? ముందెవర్ని పిలుస్తాడో?

అరె! జవాను అటు పోతున్నాడేం ఆఫీసులోకి—

సాయంకాలం ఐదు గంటలకే రిజల్టు చెప్పేస్తారు. అమ్మతో తనకు వుద్యోగం వచ్చిందని చెప్తే ఎంత ఆనందిస్తుంది! ఒకవేళ సెలక్టు కాకపోతే?

విశ్వనాథం గుండెల్లో రోడ్డు ఇంజన్ ధ్వని బుర్రలో విమానాల రొద!

గడియారం రెండు కొట్టింది!

ఇంకా పిలవరేం?

"డామిట్! ఉక్క పోస్తోంది? ఇంతవరకూ వొక్కణ్ణి ఇన్టర్వ్యూ చెయ్యలేదు! ఎంతసేపని కూర్చోవడం? ఏయ్! ఫ్యాన్ ఇలా రావోయ్? నువ్వే ఆఫీసరులా వున్నావేమిటి?" అంటూ మిస్టర్ ఆనందరావు లేచి నుంచుని కోటుగుండీలు విప్పుకొన్నాడు.

"ఏమిటి సార్?" అంటూ జవాను దగ్గరకొచ్చాడు.

"ఏమిటోయ్? ఇన్టర్వ్యూ ఒకటిన్నరకే అన్నారు! ఇంతవరకూ అమీ తుమీ లేదు!" దబాయింపుగా అన్నాడు ఆనందరావు.

"అయ్యగారు టిఫిన్ చేస్తున్నార్ సార్!"

"ఎంత తింటున్నాడేమిటోయ్? ఇంతసేపు?" అన్నాడు ఆనందరావు పళ్ళు బయటపెట్టి.

కిసుక్కున నవ్వుకుంటూ, కాలింగ్ బెల్ వినపడటంతోటే లోపలకి పరిగెత్తాడు జవాను—

ఆనందరావు ధైర్యానికి విశ్వనాథం ఆశ్చర్యపడ్డాడు. లోలోపల అతన్ని మెచ్చుకొన్నాడు.

ఒకరకంగా విశ్వనాథం ఆనందపడ్డాడనే చెప్పాలి. వచ్చినవాళ్ళల్లో తనతోపాటు డిగ్రీ వుంది అతనికి. వీడు లోపలికి పోయి ఆఫీసరుగారు అడిగిన ప్రశ్నకు యిలాగే అదిరిపాటుగా సమాధానం చెప్తే, చస్తే సెలక్టు కాడు! ఆ జవాను వీడి సంగతి ఆఫీసరుకు చెప్తే రోగం బాగా కుదురుతుంది లే?

ఇంతకీ వొకడు తగ్గినా తగ్గినట్టే! పోతే ముగ్గురుంటారు. వాడు ఆ పొట్టివాడు భూషణం! మాసిన గడ్డాం! వాడు అసలు లెక్కలోనివాడు కాడు. పోతే యీ జుట్టు ముడివాడొకడున్నాడు? వీడి ఆకారం వీడూను. ఆఫీసరు ఎలా లైక్ చేస్తాడూ?

ఇకపోతే ఐదోవాడు వుండాలి? అన్నట్టు వాడి పేరేమిటి? అయోమయమా? ఆఁ. అరవిందం! ఇంతకీ వాడేడీ?—విశ్వనాథం బెంచీమీదనుంచి వంగి పక్కకు చూశాడు.

—అరవిందం దూరంగా వున్న బల్లమీద గోడకానుకొని నిద్రపోతున్నాడు! అది చూసేటప్పటికి విశ్వనాథానికి నవ్వొచ్చింది!

ఇహ ఈ నిద్రమొహంవాడు ఏం సెలక్టు అవుతాడు? పోతే తనకే మంచి అవకాశం వుంది!

విశ్వనాథం కష్టపడి తన వుహాసౌధానికి వొక్కొక్క ఇటుకే పేర్చుకొంటున్నాడు.

ఉండీ ఉండీ విశ్వనాథం హృదయంలో దబ్బనంపోటులా గుచ్చుకొంది! అందరూ తనలాగా వుద్యోగంకోసం కొండంత ఆశ పెట్టుకునివచ్చినవాళ్ళేగా? వాళ్ళూ తనను గురించి ఇలాగా అనుకొంటున్నారా? ఇక్కడ జరుగుతున్నదేమీ పట్టనట్టు నిశ్చింతగా నిద్రపోతోన్న అరవిందంమీద జాలి పుట్టుకొచ్చింది విశ్వనాథానికి.

విశ్వనాథం లేచివెళ్ళి నిద్రపోతూన్న అరవిందాన్ని భుజంతట్టి లేపాడు. అరవిందం తత్తరపోయి లేచి నుంచొని కళ్ళు నులుపుకొంటూ "నన్ను పిలిచారా?" అంటూ ఆఫీసరు గదివేపుకు పోతున్నాడు.

విశ్వనాథానికి నవ్వు వచ్చింది. అతణ్ని వారించి "ఇంకా లేదులే! పిలుస్తారేమోనని లేపాను!" అన్నాడు.

"అంతేనా? టైం ఎంతయింది?" ఆవలిస్తో అడిగాడు అరవిందం.

విశ్వనాథం గడియారం చూసి—

"మూడుగంటలైంది!" అన్నాడు.

"మంచినీళ్ళవుతూన్నయ్! బయటికి పోయి సోడా తాగివద్దాం వస్తారా?" అన్నాడు అరవిందం.

మంచినీళ్ళనగానే విశ్వనాథానికి ఏదో మర్చిపోయినట్టు గుర్తుకు వచ్చింది.

"నాకూ చాలా సేపట్నుంచీ గొంతెండిపోతూంది! కాని మనం అటు వెళ్ళగానే పిలిస్తే?" విశ్వనాథం కొశ్చన్మార్కులా ముహం పెట్టి అన్నాడు.

"పిలవర్లే!" ఎంతో నమ్మకంగా


ప్రెసిడెంటు

వెజిటబుల్ హేర్ఆయిల్,

స్నో, టాల్కమ్ పౌడర్

నా వాడుకకు శ్రేష్టమైనవని

తెలిసికొంటిని.



— సావిత్రి

తయారుచేయువారు :

మెసర్సు రథోడ్ ట్రేడింగు కంపెని

మద్రాసు-1

అన్నాడు అరవిందం. ఆ నమ్మకానికి ఆధారాలేమీ లేవని అరవిందానికీ తెలుసు. అవసరాన్నిబట్టి కొన్నికొన్ని సందర్భాల్లో నమ్మకాలు తెచ్చిపెట్టుకోవాలనే ధోరణిలో వున్నాడు అరవిందం.

అరవిందంతో పాటు మెట్లుదిగి, పది గజాలు నడిచేసరికి విశ్వనాథానికి పచ్చి వెలక్కాయ గొంతున పడినట్టయి—

"ఒక వేళ పిలిస్తేనో?" అన్నాడు.

"పిలిస్తే మళ్లీ పిలుస్తార్లే!" విసుగ్గా అన్నాడు అరవిందం.

"మళ్ళీ అంటే?"—అనుమానంగా విశ్వనాథం.

"నువ్వు ఇదేనా మొదటిసారిగా ఇన్‌టర్వ్యూకు రావడం?" నవ్వుతూ అడిగాడు అరవిందం.

ఆ నవ్వులో వ్యంగ్యం గోచరించింది విశ్వనాథానికి.




S. 235-X52 TL

# ★ 'రాకుమారీ స్వయంవరం' ★

"అవును! ఇదే మొదటిసారి! మరి నువ్వో?" నూటిగా ప్రశ్నించాడు విశ్వనాథం.

"ఐదు! కాదు—ఆరు! ఇది ఆరో ఇంటర్వ్యూ అన్నమాట!" తామరాకుమీద నీటిబొట్టు కదిలినంత తేలిగ్గా అంటీ అంటనట్టు అనేశాడు అరవిందం.

"ఆరోసారా?" విశ్వనాథానికి గుండెలు చిక్కబట్టినై.

'—తనూ ఆరుసార్లు రావాల్సి వుంటుందా? ఎందుకూ తను మొదటిసారితోనే సెలక్ట అయిపోడూ! వీడు నిద్రమొహమోడు కాబట్టే యిన్నిసార్లూ సెలెక్టు కాలేదు. ఇలాగే ఎప్పుడో బయటికి పోయినప్పుడో, బెంచీలమీద పడుకొని నిద్రపోతున్నప్పుడో ఆ పుణ్యకాలం కాస్తా అయిపోయివుంటుంది ధూత్! అసలు వీడి వెంట బయటికి రావటమే తప్పు' అనుకుంటూ చక్కన ఆగాడు విశ్వనాథం. అప్పటికే ఆఫీసుఆవరణగేటు దాటి బయటి రోడ్డుమీదకు వొచ్చారు.

దూరంగా వో అరఫర్లాంగు దూరంలో సోడాకొట్టూ, దానిపక్కనే కాఫీహోటలూ కనిపిస్తున్నాయి.

"మిస్టర్ అరవిందం! నువ్వు పోయి తాగిరా! నాకిప్పుడు వద్దులే!" అంటూ విశ్వనాథం గిరుక్కున వెనక్కు తిరిగాడు. ప్రాణం నీళ్ళకోసం తపించిపోతోంది. కాని పిలుస్తారేమో! తన పేరు పిలిచారేమో?

"విశ్వనాథం! విశ్వనాథం!!" విశ్వనాథం చెవుల్లో దూరంనుంచి అస్పష్టంగా వినపడింది. అతని మనసులోని ఆలోచనల హోరు చెవుల్లో ప్రతిధ్వనించింది.

విశ్వనాథం ఒక్క పరుగులో లోపల కొచ్చిపడ్డాడు. కాని ఎక్కడివాళ్లు అక్కడ కూర్చొనివున్నారు. కళ్ళకు కనిపించే ఎండమావులు విశ్వనాథానికి చెవులకే వినిపించినై.

అక్కడికీ అనుమానం తీరక—

"నన్ను పిలిచారా?" అని అడిగాడు విశ్వనాథం.

"వాడెందుకు పిలుస్తాడయ్యా! ఐదు కానిదే?" కసిగా అన్నాడు ఆనందరావు కోటువిప్పి భుజాన వేసుకొని.

విశ్వనాథం ముఖానపట్టిన చెమటతుడుచుకొన్నాడు. దాహం! నాలుక పిడచగట్టుకుపోతూంది. తను వట్టిఫూల్! గాభరాగాడు. అరవిందంతోపాటు పోతే యీపాటికి సోడా తాగొచ్చేవని. ఇక ఆగలేడు దాహం - దాహం-

ఆఫీసరు గదిముందు కూర్చొని; కళ్లు కోడి కళ్ళలా మూతవేసి గుర్రు కొట్టడానికి, సిద్ధంగావున్న జవానుదగ్గరకు పోయి విశ్వనాథం—

"ఒకగ్లాసు మంచినీళ్లు తెచ్చి పెడుదూ!" అని ప్రాధేయపూర్వకంగా అన్నాడు.

ఆఫీసరు పిలుస్తున్నాడేమోనని తత్తరపడి లేచిన జవానుకు విశ్వనాథంమీద వల్లమాలిన కోపం వచ్చింది. కాదు మరి కమ్మని నిద్ర చెడగొట్టాడాయె?

"అదుగో ఆ ఇంటివెనక కొళాయి వుంది! పోయి తాగండి!" అంటూ వాచ్‌మన్ షెడ్ వైపు చూపించాడు ముఖం చిట్లించుకొని.

విశ్వనాథం కొళాయిదగ్గరికెళ్లి కడుపు నిండా నీళ్లుతాగి, ముఖంమీద చల్లుకొన్నాడు. ప్రాణం తేరుకొన్నట్టు అయింది. నీళ్లు తలమీద చల్లుకొంటూ కాసేపు కూర్చున్నాడు.

"విశ్వనాథం! విశ్వనాథం!!" దూరంగా ఎక్కడో అస్పష్టంగా పిలుపు - విశ్వనాథం బుర్రలో సంగీతం పాడింది!

విశ్వనాథం వడివడిగా - పరుగుపరుగున వచ్చాడు. కడుపులో నీళ్లు జోడెద్దుల బండిమీది సత్రవుపీపాలోని నీళ్లలా 'గుబుక్-' 'గుబుకూ'మని మోగినై.

విశ్వనాథం తిరిగొచ్చేసరికి అక్కడ ఎవరూ లేరు! వాళ్లు కూర్చున్న పొడుగాటి బల్ల ఖాళీగా వుంది!

విశ్వనాథానికి గుండెలు జార్‌మన్నాయి! ఇన్‌టర్వ్యూ ఐపోయిందా?

కాళ్లకింద భూమి కదులుతోంది! కళ్లు మైకం కమ్ముతున్నాయి! బుర్రలో విమానాలరొద-టాంకుల చప్పుడూ—

తను మంచినీళ్లు తాగుతూ అక్కడ ఎంతసేపున్నాడు? మూర్ఛపోయి ఎక్కువసేపు అక్కడే పడివుండలేదుగదా? తను మూర్ఛపోవడమేమిటి? నాన్‌సెన్స్!

ప్యూన్ అన్నా వున్నాడేమో అనుకుందామని ఆఫీసరు గదివైపు చూశాడు—

వాడూ అక్కడ లేడు!

'హరి భగవంతుడా? ఆఫీసరు కూడా వెళ్లిపోయాడా?'

విశ్వనాథానికి కాళ్లు వణుకుతున్నాయి. గుండెల్లో ఆయాసం, వళ్ళంతా నీరసించిపోతోంది. బల్లమీద కుప్పగా కూలబడ్డాడు.

డాక్టరు కావాల్సిన విశ్వనాథం డెబ్భైరెండు రూపాయల జీతంమీద గుమాస్తాగిరి! దానికి భగీరథుని తపస్సూ—హరిశ్చంద్రుని కష్టాలూ—అగ్ని పరీక్షలూ—

తనకు రాబోయే డెబ్భైరెండు రూపాయలకోసం—అమ్మకు చిరకాల వాంఛితమైన సైనుపంచా, చెల్లెలు నిత్యం కలలు కనే ఖటావ్ వాయిల్ చీరా, తమ్ముడి పెద్దబాలశిక్షా ఎదురు చూస్తున్నాయి

తనూ, అమ్మ, చెల్లీ, తమ్ముడూ, కనీస జీవితావసరాలే జీవితాదర్శాలు కాగా ఎడారిలో వాళ్ళకోసం రెక్కలు విప్పుకు ఎగిరే పక్షిలా, చిన్న వుద్యోగం గుమాస్తాగిరి రెపరెపలాడే జీవితాలకు ఇంత ఆధారం కోసం వెతుకుతూంటే ఇంత దారుణం జరగాలా?

పొద్దుట్నించీ పడిగాపులు గాచాడే! దాహం తీర్చుకొచ్చేసరికే—

"హలో! మిస్టర్ విశ్వనాథం! మీరు కాఫీకి రాలేదేం?" అప్పుడే మెట్లెక్కివస్తూ భూషణం అన్నాడు.


—సాలెగూడులా అల్లుకొంటున్న విశ్వనాథం ఊహలు చిందరవందరై చెదిరిపోయినై. పీడకలలో మెలకువ వచ్చినవాడిలా చూశాడు.

భూషణం వెనకే మిగతా ముగ్గురూ వచ్చారు. నలుగురూ బల్లమీద విశ్వనాథం పక్కన సర్దుకు కూర్చున్నారు.




ఇది సంభవించకుండా చూడవచ్చును...

ఎస్ట్రెలా బ్యాటరీలు మీకు నూతన వెలుతురు నిచ్చును. ఎస్ట్రెలా బ్యాటరీలు కొని, మీ సామానులకు చెరుపు లేకుండా చూడుడు. అవి తప్పకుండా ప్రకాశవంతమైన వెలుతురు నిచ్చును - ధరతక్కువ




ఎస్ట్రెలా బ్యాటరీలు

ఎస్ట్రెలా బ్యాటరీస్ లిమిటెడ్. బొంబాయి—మద్రాస్—ఢిల్లీ—నాగపూరు—కాన్పూరు—కలకత్తా

NAS 220

జవాను ఫ్లాస్కుతో ఆఫీసరు గదిలోకి వెళ్ళాడు.

విశ్వనాథం పరిస్థితి అంతా అర్థం చేసుకుని సిగ్గుపడ్డాడు. తను అనవసరంగా ఖంగారుపడ్డాడు! వట్టి ఫూల్!

"ఇంతకీ ఇవ్వాళ మనకు రాజకుమారి దర్శనమవుతుందంటారా?" అన్నాడు భూషణం

అంతా నోరు తెరుచుకొని భూషణంకేసి వింతగా చూశారు. కాఫీ తాగొచ్చిం దగ్గర్నుంచీ భూషణం మాంచి హుషారుగా వున్నాడు.

"రాజకుమారి ఎవరోయ్ భూషణం?" అన్నాడు ఆనందరావు టై వూడదీసి కట్టుకొంటూ.

"రాజుగారి కూతురు—రాజకుమారి!" నొసలు పైకెత్తి కళ్లు మెరిపిస్తూ అన్నాడు భూషణం.

"అంటే ఆఫీసరుగారు?......" మిగతా మాట వచ్చే అవలింతలో తేలిపోయింది అరవిందానికి.

"మన విసియాను అమాంతం ఖూనీ చేస్తున్నావ్ అరవిందం! రాజు అంటే గవర్నమెంట్! కూతురు అంటే జాబ్! ఎందువల్లనంటావా? రాజుగారి కూతురు దొరికినా, రాజుగారి కొలువు దొరికినా వొకటే గా?"

"ఉద్యోగం అంటే డబ్బు అనగా లక్ష్మి. లక్ష్మీదేవి ఆడదిగదా? దేర్ ఫోర్ - ప్రభుత్వోద్యోగం అంటే రాజకుమారి!" చేతులు తిప్పుతూ భూషణం అన్నాడు.

విశ్వనాథానికి నవ్వాగిందికాదు "ఏమిరా మనిషి మాస్తే ఇంత వున్నాడు పొట్టి బుడంకాయల్లే; మాటలు మాస్తే - అందుకే ఏ పుట్టలో ఏ పాముందో అంటారు' మనసులో అనుకొని విశ్వనాథం—

"మాష్టారూ మీ గ్రూపు ఏవిటండీ?" అని భూషణాన్ని అడిగాడు.

"ఇనటర్ ఆల్జీబ్రాతో బుర్ర తిరిగి చదువు మానేశాను!" అన్నాడు భూషణం. అంతా కాసేపు మౌనంగా కూర్చున్నారు.

"మనం రాజకుమార్తె స్వయంవరానికి వచ్చిన రాజకుమారులమన్నమాట!" స్టేజి యాక్టరులా అన్నాడు భూషణం.

"భలే! భలే మాట అన్నావ్!" భూషణానికి వుషారిచ్చాడు ఆనందరావు.

"మన ఐదుగురిలో అసలు వరుడు వకడే వున్నాడు! రాకుమారి దమయంతి అసలు నలుడెవడో తేల్చుకొని దండవేసేస్తుంది!"

"రాణిసంయుక్తలాగా, యీ రాజకుమారి స్వయంవరానికొచ్చిన రాజులందర్నీ వదిలేసి వాకిటి బయటవున్న ఏ పృథ్వీరాజు బొమ్మకో వేస్తే?" అన్నాడు అరవిందం.

అరవిందం హిస్టరీ స్టూడెంటు! విశ్వనాథం అతడివంక ఆశ్చర్యంగా చూశాడు—

'వీడి దుంపతెగ! ఎంత తెలివిగా అన్నాడు! మళ్ళీ చూస్తే నిద్రముఖం వీడూను? అందరూ అన్ని కతుల్లాగానే వున్నారే?' అనుకొన్నాడు.

"ఇన్నిటికీ ఆ రాజకుమారికి రహస్య ప్రియుడు ఎవడైనా వున్నాడో ఏమో?" అన్నాడు ఆనందరావు. తను మాత్రం ఊరికే ఎందుకుండాలి!

విశ్వనాథం గడియారం చూశాడు—నాలుగున్నర అయింది!

"పిలుస్తాడో లేదో కనుక్కుందాం మనంకి! ఇంకా ఇంతసేపు కూర్చోవడం!" విసుగ్గా అన్నాడు ఆనందరావు.

విశ్వనాథం—"ఇంతసేపు కూర్చున్నాం గదా? ఇహ ఆ అరగంటకూడా చూద్దాం!" వాడిపోతూన్న ఆశలకు నీరుపోస్తూ అన్నాడు.

"మిస్టర్ అర్జున్ రావు మత్స్యయంత్రం నువ్వే కొట్టాలి!" భూషణం ముందుకువంగి విశ్వనాథంవంక చూస్తో అన్నాడు.

"నా పేరు విశ్వనాథం!" అన్నాడు వెలవెల పోతూ విశ్వనాథం.

"అవునే! పంచపాండవులు ఐదుగురు కదా? మనమూ ఐదుగురమే! మత్స్యయంత్రాన్ని కొట్టి ద్రౌపదిని చేసుకోడానికి వాళ్లు వెళ్లినదీ, ఇప్పుడు మనం వచ్చిందీ ఇంచుమించు వొకటే! మనం కూర్చున్న వరుసచూస్తే, నేను ధర్మరాజూ, అరవిందం భీముడూ, నువ్వు అర్జునుడూ, తిరుమలై, ఆనందరావులు నకుల సహదేవులూ అవుతారు!"

"మీకు తెలుగు సాహిత్యంలో బాగా ప్రవేశమున్నట్టుందే?" అన్నాడు విశ్వనాథం.

"ఆఁ మా నాన్న పండితుడు. సంస్కృతం తెలుగూ బాగా చదువుకున్నారే చిన్నప్పుడు!" అన్నాడు భూషణం.

"అంటే మీరు పండితపుత్రులన్న మాట!" ధమక్ గా అనేశాడు విశ్వనాథం. అంతా వొక్కసారి నవ్వుకొన్నారు.

అంతలావు భూషణాన్ని దెబ్బకొట్టానని లోలోపల గర్వపడ్డాడు విశ్వనాథం.

"ఇంతకీ మన అశ్వనాథం మత్స్యయంత్రాన్ని కొట్టి రాజకుమారిని సంపాదించి మనకు భాగం పెట్టడా?" నటుని పద్ధతిలో చెయ్యితిప్పుతూ అన్నాడు భూషణం.

"రాజకుమారి ద్రౌపది కాదు! ఏకభర్తృక! ధర్మపత్ని! ఒక్కడే భర్త!" అని మాటకు మాట విసిరాడు విశ్వనాథం.

"దటీజ్ ట్రూ! ఒకణ్ని డైవర్సు చేసేదాకా రెండోవాణ్ని చేపట్టేందుకు వీలులేదు యీ రాజకుమారికి!" అన్నాడు ఆనందరావు.

విశ్వనాథం గోడనవున్న గడియారంకేసి చూశాడు - నాలుగుముప్పావ్ అయింది!

'ఐదుకు ఇంకా పదిహేను నిముషాలు తక్కువ! ఒక్కొక్కడికి మూడునిమిషాలు పట్టినా పదిహేను నిముషాలు పట్టుంది ఇంటర్వ్యూ పూర్తికావడానికి?

—ఇంకా పిలవడేం?'

ఆఫీసరు గదిలోంచి కాలింగ్ బెల్!—'సార్! వస్తున్నా' - జవాను లోపలకి పరుగు తీశాడు.

"ఎస్టాబిష్ మెంటు సూపర్నెంటును పిలువ్!"

"సూపర్నెంట్ సార్! అయ్యగారు పిలుస్తున్నారు!"

సణుక్కుంటూ సూపర్నెంటు జవాను వెనుకే ఆఫీసరు గదిలోకి పరుగు—

'ఐతే ఇక ఇన్టర్వ్యూ మొదలవుతుంది!' -విశ్వనాథం గుండెల్లో దడదడా, తల్లో బుయ్ఁ బుయ్ఁ సాగినై.

—మత్స్యయంత్రం తనే కొట్టాలి - అద్దంలోనుంచి చూస్తూ పైన గిర్రున తిరుగుతున్న మత్స్యయంత్రాన్ని వొక్క బాణంతో-పాంచాలి పూలదండ తన మెడలో వేస్తోంటే - రాజకుమారి చెయ్యిపట్టుకొని-చిన్నప్పుడు చూసిన సురభికంపెనీ నాటకంలో - అర్జునుడు ఎంత దక్క—

"విశ్వనాథం! విశ్వనాథం!!" అరె! తననే ముందు పిలిచారు. తనదె ఛసుఛాన్స్!

ఆఫీసరు గదిలోకి వెళ్తుంటే ఇదేమిటి తనకాళ్లకు భూమి తగలటలేదేం? మోకాళ్లు అంతగా ఎందుకు వణుకుతాయి! ము-ము-ముట్కట కూడా రా - రావటంలేదేం?

రాక్షసుడిలా ఆ ఆఫీసరుకు కోరలా -


## బహుమతి రు. 500

(గవర్నమెంటు రిజిస్టరు)

తెల్ల వెండ్రుకలను పోగొట్టును

రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము సువాసనగల "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60 సం॥ల వయస్సువరకు వెండ్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనము ఇచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపక శక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు. 3-8-0; 3 సీసాలు రు. 9-0-0 సగము నెరసివుంటే ఒక సీసా రు. 5-0-0. 3 సీసాలు రు. 12/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు. 18/- లు. ఇది పనిచేయదని నిరూపించిన రు. 500/-

GENERAL LABORATARIES,

(H. O) P. O. Rajdhanwar H. Bagh).

## ★ 'రాకుమారి స్వయంవరం' ★

జీబుజుట్టూ లేదేం? అంతా మామూలుమనిషిలాగానే వున్నాడేం?

"వాటీజ్ యువర్ క్వాలిఫికేషన్!-" ఆఫీసర్.

"బి. ఏ! ఇ-ఇంటర్‌లో క్లాసు వచ్చింది సార్!"

"అంటే బి. ఏ. లో క్లాసురాలేదా?" ఆఫీసరు విరగబడి నవ్వుతున్నాడు.

"లేదు సార్! ఐదుమార్కుల్లో పోయింది!"

"ఐదుమార్కుల్లో పోయినా వంద మార్కుల్లో పోయినా ఒకటే లేవయ్యా!" ఆఫీసర్ కళ్ళల్లో అదంతా కోపమే!

అమ్మో! ఆఫీసరుకు కోపంవచ్చింది! తను కాళ్ళు ఇంకొంచం దగ్గరకు జరుపుకొని, చేతులు వెనక్కు గట్టిగా బిగించిపట్టుకొని, వళ్ళు ఇంకొంచం - ఇంకొంచెం - ఆఁ! అలావంచి నిల్చుంటే సరి!

"మీతండ్రి ఏం చేస్తుంటాడు?"

"మా తండ్రా సార్!"

"అవును మీతండ్రేనోయ్! మరి ఎవడి తండ్రి అనుకొన్నావ్?"

"యస్ సార్! మా నాన్న తాలూకా ఆఫీసులో హెడ్‌గుమస్తా చేస్తో రిటైరయా!"

"రిటైరయా-?"

"చనిపోయాడు సార్!"

"ఓ ఐసీ! మరి వుద్యోగం యిస్తే బాగా చేసుకుంటావా?"

"యువర్ మోస్ట్ ఒబీడియన్ట్ ఫైత్‌ఫుల్ సర్వెంటుగా"—

"ఆల్ రైట్! ఇక ను వ్వెళ్లొచ్చు!"

"థాన్క్ యూ! థాన్క్యూ వెరిమచ్!" సినిమాస్కోప్ సినిమాలో సీజరు దర్బారులో సైనికుడిలా-వెనక్కు వెనక్కే నడిచి-నడిచి - బయటికి రాగానే వీరాధివీరుడిలా, సింహంపిల్లలా రొమ్ము విరుచుకొని ఆఫీసరు గదిలోంచి బయటికి వస్తోన్నాడు తను-! కొండలూ- సముద్రాలూ-లోయలూ అగాధాలూ—

"ఏవిటోయ్! మిస్టర్ విశ్వనాథం! నువ్వు ఇక్కడవుండే మత్స్యయంత్రానికి గురిపెట్టున్నట్టున్నావ్?"-విశ్వనాథం భుజంతట్టి వూపుతూ అన్నాడు భూషణం.

విశ్వనాథం కలలు కరిగిపోయినై! భ్రమలు విచ్చిపోయినై! కొండమీదనుంచి దొర్లిన మట్టికుండలా విశ్వనాథం ఆలోచనలు చెల్లాచెదరయిపోయినాయి.

తలా, ముఖం, చొక్కా వర్షంలో తడిసినట్టుగా వుంది!

వళ్ళంతా చెమటలుకమ్మినై - హీనస్వరంతో కళ్లు తేలవేస్తో—

"భూషణం! నా కేదో కళ్లు తిరుగుతున్నట్టు మైకంగా వుంది!" అన్నాడు విశ్వనాథం.

"కాదు మరీ! పొద్దున ఎప్పుడు తిన్నావో పాపం! మధ్యాహ్నం కాఫీకూడా తాగకపోతివి? తే! ఇంద! కాస్త సంజీవి పుచ్చుకో?" అంటూ భూషణం కాఫీగ్లాసు విశ్వనాథం నోటికి అందించాడు.

ముఖాన కారుతోన్న నీళ్ళతడి తుడుచుకొంటూ విశ్వనాథం జాలిగా, వెర్రిగా చూస్తో—"నేను - నేను మూర్ఛపోయానా?" అన్నాడు.

"అవును! తమ్ముడా! లక్ష్మణా! మరి సంజీవి తెప్పించాంగా! ఒక్క గుటక వెయ్ ముందు!" ఫక్తు నాటకఫక్కీలో అన్నాడు భూషణం.

విశ్వనాథానికి నవ్వూ ఏడుపూ కలిసి వచ్చాయి—

"నువ్వుండవోయ్ రామచంద్రా! అసలే విశ్వనాథం గాభరాపడిపోతుంటేను!" అని భూషణాన్ని మందలించాడు ఆనందరావు.

అరగ్లాసెడు కాఫీ తాగినాక కొంచెం తేరుకొన్నాడు విశ్వనాథం.

"మీకు ఇదివరకు ఎప్పుడన్నా ఇలాగే వచ్చేయా?" అని అడిగాడు అరవిందం.

"లేదు! ఇదే మొదలు—" సాలోచనగా అన్నాడు విశ్వనాథం.

"ఏమైనా, మీకు నర్వస్ వీక్‌నెస్ లాగా వుంది! మంచి వైటమిన్ ఫుడ్ తీసుకోవాలి!" బి. యస్. సీ విజ్ఞానాన్ని వెలగబెడ్తో అన్నాడు ఆనందరావు.

"అసలు ఆహారమంటూ వొకటి దొరికితే, అందులో వైటమిన్సు వున్నాయో లేదో తర్వాత చూసుకోవచ్చు!"— మనసులో అనుకొన్నాడు విశ్వనాథం.

"మీరు అంతగా మానసికబాధలకు లోనుకాకూడదు. మెన్టల్ స్ట్రెయిన్, మీ నరాలమీద దెబ్బ తీస్తుంది!"

"తనకు మానసికబాధలు కావాలని కోరుకొన్నాడా? వాటిని కోరి తెచ్చుకుంటున్నాడా?" మనసులో మథనపడ్డాడు విశ్వనాథం—

'అన్నట్టు ఇన్టర్వ్యూ ఏమయింది?' గడియారంకేసి చూశాడు. అదెందుకు ఆగిపోతుంది? తనంటే దానికి జాలా?

ఐదుకు ఇంకా రెండు నిముషాలుంది! విశ్వనాథం గుండెల్లో ఏదో బరువుగా తగిలినవాడై—

"ఇన్టర్వ్యూ ఐపోయిందీ?" నిరాశలో మునిగిపోతూ అన్నాడు.

"లక్ష్మణమూర్ఛ అయినా సీతజాడలైనా కంటపడలేదుగదా తమ్ముడూ?" అన్నాడు భూషణం వచ్చిన అవకాశాన్ని వదులుకోకుండాను.

అంతా వొక్కసారి గొల్లున నవ్వా

"ఆ ఇన్టర్వ్యూ సంగతేదో తేల్చుకుందాం పదండి! ఐదయిపోతూంటేను!" బల్లమీద నుంచి లేచినుంచుని అన్నాడు ఆనందరావు.

"సరే! సంగతేమిటో అడిగేద్దాం పదండీ!" అంటూ అంతా లేచి నుంచుని ఆఫీసు లోపలికి పోవడానికి సిద్ధమయ్యారు.

అంతలోకే ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ అప్పర్ డివిజన్‌గుమస్తా వొకడు చేతో ఒక ఫైల్ పట్టుకొని బయటకు వచ్చాడు.

చూట్టానికి నలభై సంవత్సరాల్లా కనపడుతోన్న ముప్ఫై ఏళ్ళ ఆ గుమస్తా ఇన్టర్వ్యూకోసం కాచుకొనివున్న ఐదుగురు అభ్యర్థులను సమీపించి అన్నాడుగదా—

"మా ఆఫీసులో ఖాళీఅయిన లోవర్ డివిజన్ గుమాస్తా పోస్టులో నిన్ననే మా ఆఫీసు అటెండరును వొకడిని ప్రమోట్ చేసివేశాం! ఆ సంగతి నిన్ననే ఎంప్లాయిమెంట్ యక్స్ఛేంజ్ వాళ్లకు తెలియజేశాం. ప్రస్తుతం మాఆఫీసులో ఏమీ ఖాళీలు లేవు!"

అది వింటూనే అభ్యర్థులు ఐదుగురూ గుడ్లు మిటకరించి కొయ్యబొమ్మల్లా నిశ్చేష్టులయి నుంచున్నారు!

"ఐతే ఎంప్లాయిమెంట్ యక్స్ఛేంజి వాళ్లు మమ్మల్ని ఇక్కడకెందుకు పంపించినట్టూ?" తీవ్రంగా అన్నాడు ఆనందరావు.

ఫైల్ చంకన పెట్టుకొని పోతూన్న గుమాస్తా వెనక్కు తిరిగి—

"బహుశః మా రిఫరెన్సు, వాళ్ళ రిఫరెన్సూ క్రాస్ అయివుంటయ్!" అన్నాడు.

"మీ రిఫెరెన్సులు కావయ్యా! అసలు మా స్టార్స్ క్రాస్ అయివుంటాయిలే" అన్నాడు భూషణం.

గుమస్తా అదే పోతగా లోపలికి పోయాడు.

అభ్యర్థులంతా ఆఫీసుమెట్లు దిగి నడచి ఆవరణ గేటు దగ్గర కొచ్చారు

—విశ్వనాథానికి లోలోపల దుఃఖం, చల్లమాలినదుఃఖం పసిఫిక్ సముద్రం అంత లోతుగా— హిమాలయాలంత ఎత్తుగా నయాగరాలు దూకటానికి ఘోష పెడుతోంది.

"సాహసివి కనే రాకుమారీ! తోటమాలినే వరించావుగదే?" నేపాళ మాంత్రికుడిలా పోజు పెట్టి గాల్లోకి చేయి విసురుతూ అన్నాడు భూషణం.

భూషణం మాటలు వింటోన్న విశ్వనాథం కళ్ళ వెనక నవ్వూ, ఏడుపూ నేనుముందంటే నేను ముందనికీచులాడుకొన్నాయి. ★